

వాత్సల్యం 'మిస్సింగ్'
పిల్లలపై అభిమానం చూపించాల్సిన తల్లిదండ్రులు అధికారం చెలాయిస్తున్నట్లు తాజా సర్వేలు చెబుతున్నాయి.
- 10లో▸



ట్యాపింగ్‌లో పెద్ద తలలు..
ఒకటి, రెండు రోజుల్లో ఫోన్ ట్యాపింగ్‌లో పెద్ద తలకాయల పేర్లు బయటపడనున్నాయని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి అన్నారు.
- 10లో▸

గరిష్ఠం/కనిష్ఠం
$35^0/26^0$

వాతావరణం
జిల్లాలో ఉదయం ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం ఎండ ఎక్కువగా ఉంటుంది. రాత్రి చల్లగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

ఉత్సవాలను జయప్రదం చేయాలి

ములుగు రూరల్: జిల్లాకేంద్రంలోని బస్టాండ్ సమీపంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద ఈ నెల 14వ తేదీన అంబేడ్కర్ జయంతి వేడుకలను షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్సీ డెవలప్‌మెంట్ అధికారి తుల రవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 14వ తేదీ ఉదయం 09 గంటలకు నిర్వహించనున్న కార్యక్రమానికి దళిత సంఘాల నాయకులు, ప్రభుత్వ అధికారులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

వాహన తనిఖీలు



వాజేడు: మండల పరిధిలోని మండపాక వద్ద జాతీయ రహదారిపై వాజేడు ఎస్సై వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం రాత్రి వాహన తనిఖీలు చేపట్టారు. రహదారిపై వచ్చి వెళ్లే ప్రతీ వాహనాన్ని పరిశీలించారు. వాహనాల్లో తరలిస్తున్న సామగ్రి, బ్యాగులను సోదా చేశారు. నగదు, సారా తరలింపులపై ప్రత్యేక దృష్టిసారించినట్లు పేర్కొన్నారు. ప్రయాణికుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

ట్రాఫిక్ రూల్స్ పాటించాలి



కాళేశ్వరం: ట్రాక్టర్ డ్రైవర్లు ట్రాఫిక్ రూల్స్ కచ్చితంగా పాటించాలని, రోడ్డు ప్రమాదాలు జరుగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కాళేశ్వరం ఎస్సై భవానిసేన్ ట్రాక్టర్ డ్రైవర్లు, ఓనర్లకు అవగాహన కల్పించారు. శుక్రవారం కాళేశ్వరం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ట్రాక్టర్లకు రెడ్ రేడియం స్టిక్కరింగ్ అంటించారు. ఆయన మాట్లాడుతూ మద్యం సేవించి ట్రాక్టర్లు నడిపితే చర్యలు తీసుకుంటామన్నారు. ట్రాఫిక్ రూల్స్ పాటించి ఇతరులకు ఇబ్బంది లేకుండా నడుపాలన్నారు. ప్రతి డ్రైవర్‌కు లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలన్నారు. ట్రాక్టర్లకు ధృవీకరణ పత్రాలతో పాటు ఇన్సురెన్స్ తప్పనిసరి అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాక్టరు ఓనర్లు, డ్రైవర్లు పాల్గొన్నారు.

బాలల హక్కులను కాపాడాలి



భూపాలపల్లి రూరల్: బాలల హక్కులకు భంగం కలిగించకుండా వారి హక్కులను కాపాడాలని చైల్డ్ హెల్ప్‌లైన్ జిల్లా కో–ఆర్డినేటర్ తిరుపతి అన్నారు. భూపాలపల్లి మండలంలోని కొత్తపల్లి (ఎస్‌ఎం)గ్రామంలో ఉపాధి హమీ పనుల కూలీల వద్ద శుక్రవారం బాలల హక్కులు, 1098 టోల్ ఫ్రీ నంబర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్ లైన్ మండల ఇన్‌చార్జ్ సాయిరాం, వర్కర్ చరణ్, గ్రామఫీల్డ్ అసిస్టెంట్ రాజేష్ వర్మ, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

నీటి సరఫరాకు అంతరాయం కలిగిస్తే చర్యలు



కాటారం: మిషన్ భగీరథ ద్వారా జరుగుతున్న నీటి సరఫరాకు అంతరాయం కలిగిస్తే చర్యలు తప్పవని మిషన్ భగీరథ డీఈఈ రమేష్ హెచ్చరించారు. కాటారం మండలం ఇబ్రహీంపల్లి ఎస్సీ కాలనీకి తాగునీరు అందకపోవడంతో మహిళలు ఖాళీ బిందెలతో గురువారం జీపీ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టిన విషయం విదితమే. కలెక్టర్, డీపీఓ ఆదేశాల మేరకు శుక్రవారం డీఈఈ రమేష్, ఏఈఈ రాజశేఖర్ ఎస్సీ కాలనీలో నీటి ఎద్దడిపై ఆరా తీశారు. ఈ సందర్భంగా డీఈఈ మాట్లాడుతూ గ్రామంలో ఓహెచ్‌ఎస్ఆర్ ద్వారా ఇంటింటికీ మిషన్ భగీరథ నీరు సరఫరా అవుతుందని.. ఎస్సీ కాలనీలో పలువురు ఫ్లో కంట్రోల్ వాల్స్ తొలగించడం కారణంగా 40 కుటుంబాలకు తాగునీరు సరఫరా నిలిచిపోయిందన్నారు. వాల్స్ తిరిగి బిగించాలని సిబ్బందిని ఆదేశించారు. ఎస్సీ కాలనీలోని పలు కుటుంబాలకు నీటి సరఫరా పునరుద్ధరణ చేసినట్లు పేర్కొన్నారు. పైపులైన్లు ధ్వంసం చేయడం, ఫ్లో కంట్రోల్ వాల్స్ తొలగించడం, మోటర్లు ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకుంటామని డీఈఈ హెచ్చరించారు.

లారీల నియంత్రణేది..?

అతివేగం, అజాగ్రత్తతో నిత్యం ప్రమాదాలు

- రేయింబవళ్లు నడుస్తున్న ఇసుక లారీలు
- రోడ్డుపైకి రావాలంటేనే జంకుతున్న జనం



లారీ ఢీకొట్టడంతో ధ్వంసమైన డివైడర్ (ఫైల్)



రోడ్డు పక్కకు దూసుకెళ్లిన ఇసుక లారీ(ఫైల్)

ఎస్ఎస్ తాడ్వాయి : ఏజెన్సీ ప్రాంతంలో ఇసుక లారీలు రాత్రి, పగలు తేడా లేకుండా నడుస్తున్నాయి. లారీల నియంత్రణకు చర్యలు కరువయ్యాయి. భారీగా ఇసుకను తరలించే వాహనాలు నడుపుతున్న డ్రైవర్ల అజాగ్రత్త, అతివేగంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రేయింబవళ్లు తేడా లేకుండా ఇసుక లారీలు నడుస్తోండడంతో జనం రోడ్డుపైకి రావాలంటేనే భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. రాత్రి సమయాల్లో వాహనాలకు పరిమితి లేకపోవడంతో డ్రైవర్లు ఇష్టారీతిన లారీలను నడుపుతున్నారు.

హైవే పై ప్రమాదాలు..
ఏజెన్సీలోని మణుగూరు నుంచి మొదలుకొని మంగపేట, ఏటూరునాగారం ఇసుక రీచ్‌ల నుంచి జాతీయ రహదారి –163పై నుంచి నిత్యం వందలాది ఇసుక లారీలు హైదరాబాద్, హనుమకొండ, తదితర ప్రాంతాలకు వెళ్తుంటాయి. ఏటూరునాగారం నుంచి పస్రా వరకు పూర్తిగా అటవీ ప్రాంతం కావడం, లైటింగ్ లేకపోవడం, మూల మలుపులు అధికంగా ఉండటంతో ఇసుక లారీ డ్రైవర్ల అజాగ్రత్త, అతివేగంతో చాలా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల తాడ్వాయి సమీపంలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులను గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో ఓ యువకుడు మృతి చెందాడు. కాగా, ఏడాది క్రితం వరకు అధికారులు రాత్రి 10 దాటిన తర్వాత ఇసుక లారీల రాకపోకలను నిలిపేసి, ఉదయం 5 గంటల తర్వాత అనుమతించేవారు. ప్రస్తుతం మాత్రం రాత్రి పగలు తేడా లేకుండా నిత్యం వందలాది ఇసుక లారీల ప్రయాణాలు కొనసాగిస్తున్నాయి.

రోడ్డుపైకి రావాలంటే భయం..
ఏజెన్సీ ప్రాంతంలోని మంగపేట నుంచి మొదలుకొని ఏటూరునాగారం, తాడ్వాయి, పస్రా, గోవిందరావుపేట, ములుగు వరకు ప్రతి మండల కేంద్రం జాతీయ రహదారిని అనుకొని ఉంటుంది. ప్రజలు ఆయా మండల కేంద్రంలో రోజువారీ పనుల నిమిత్తం ఈ రహదారి పైకి రావడం పరిపాటి. ఇటీవల రోడ్డును నాలుగు లైన్లుగా విస్తరిస్తూ అధికారులు పనులు పూర్తి చేశారు. అనంతరం రహదారి మధ్యలో డివైడర్లు ఏర్పాటు చేశారు. అయినా లారీల అతివేగం వల్ల నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దీంతో రోడ్డు పైకి రావాలంటేనే ప్రజలు జంకుతున్నారు. లారీ డ్రైవర్ల అతివేగం, అజాగ్రత్తతో ప్రమాదాలు జరుగుతున్న విషయం తెలిసినా సంబంధిత అధికారులు మాత్రం మామూళ్ల మత్తులో పడి పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారించి రాత్రి సమయంలో ఇసుక లారీల రాకపోకలను నిలిపివేసి, అతివేగంపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

డివైడర్‌ను ఢీకొన్న లారీ..
తాడ్వాయి మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై ఇటీవల నూతనంగా నిర్మించిన డివైడర్‌ను గురువారం రాత్రి ఇసుక లారీ ఢీకొట్టింది. ఏటూరునాగారం నుంచి హనుమకొండకు వెళ్తున్న ఇసుక లారీ.. తాడ్వాయి మండల కేంద్రంలోని మసీద్ నుంచి గ్రంథాలయం వరకు నిర్మించిన డివైడర్‌ను ఢీకొట్టి మసీదు సమీపంలో రోడ్డు పక్కన మట్టిలో కూరుకుపోయింది. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం లేకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. సుమారు 20 మీటర్ల వరకు డివైడర్‌ను ఢీకొడుతూ వెళ్లిన లారీకి ఎదురుగా అదే సమయంలో మరేదైనా వాహనం వస్తే భారీ ప్రమాదం సంభవించేది. డ్రైవర్ అతివేగం, అజాగ్రత్త వల్లనే ఈ ప్రమాదం చోటుచేసుకుందని స్థానికులు చెబుతున్నారు.

లారీల వేగాన్ని నియంత్రించాలి
ఇసుక లారీల వేగాన్ని నియంత్రించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి. డ్రైవర్లు అజాగ్రత్తగా ఇసుక లారీలు నడపడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. హైవే పైకి వెళ్లాలంటేనే భయమేస్తోంది. రోడ్డు మంచిగైందని ఆనంద పడాలో.. లారీల వేగాన్ని చూసి భయపడాలో.. అర్థం కావడం లేదు. అధికారులు తనిఖీలు నిర్వహించాలి.



- బంగారు మానస, మండల సమాఖ్య అధ్యక్షురాలు, తాడ్వాయి

లలితాదేవికి కుంకుమార్చన



కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు



పూజలు చేస్తున్న అర్చకులు నాగేశ్వర్‌రావుశర్మ

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని సీతారామ చంద్రస్వామి ఆలయంలో లలితా దేవిశరన్నవ రాత్రుల్లో భాగంగా కలశ స్థాపన సహిత కుంకుమార్చన శుక్రవారం రాత్రి అర్చకులు యల్లాప్రగడ నాగేశ్వర్‌రావుశర్మ నిర్వహించారు. దుర్గామాత కమిటీ సభ్యులు, భక్తులు, మహిళలు పెద్ద ఎత్తున కుంకుమార్చన పూజలకు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కలశారాధన, లలిత అష్టోత్తరం కుంకుమార్చన, లలితాదేవి సహస్రపారాయణంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అంతేకాకుండా అమ్మవారికి ప్రత్యేక పిండివంటలతో ప్రసాదాలను తయారు చేసి సమర్పించారు. కార్యక్రమంలో మహిళలు, ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

- జిల్లా వ్యాప్తంగా పలు మండలాలు, గ్రామాల్లో..
- మరమ్మతు పనుల నేపథ్యంలో అధికారుల నిర్ణయం



ములుగు రూరల్: మండలంలోని ములుగు, మల్లంపల్లి, పత్తిపల్లి, కాశిందేవిపేట సబ్ స్టేషన్ పరిధిలో నేడు(శనివారం) విద్యుత్ అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఏఈ సాయికృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 33కేవీ విద్యుత్ లైన్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకు సరఫరా నిలివేయనున్నట్లు తెలిపారు. ములుగు సబ్ స్టేషన్ పరిధిలో ఫీడర్– 1లో శ్రీనివాసకాలనీ, ప్రగతికాలనీ, వీవర్స్ కాలనీ, పత్తిపల్లి రోడ్, మహర్షి కళాశాల, ప్రేమ్‌నగర్‌లో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని తెలిపారు.

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్‌లో నేడు(శనివారం) సబ్ స్టేషన్ మెయింటనెన్స్ కారణంగా ఉదయం 8.30ల నుంచి 10.30 గంటల వరకు విద్యుత్ సరఫరా అంతరాయం కలుగుతుందని ఏఈ అశోక్ శుక్రవారం ఒక ప్రకటలో తెలిపారు.

కన్నాయిగూడెం: మండలంలో శనివారం ఉదయం 6.30 నుంచి 11.30 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కన్నాయిగూడెం విద్యుత్ ఏఈ స్వామి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏటూరునాగారం నుంచి కన్నాయిగూడెం మధ్యలోని 33కేవీ మరమత్తు కారణంగా అంతరాయం ఏర్పడనుందని వెల్లడించారు. దీంతో మండలంలోని అన్ని గ్రామాలకు సరఫరా నిలిచిపోతుందని, ప్రజలు సహకరించాలని కోరారు.

వెంకటాపురం(కె): మండలంలో నేడు(శనివారం) విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ సునీల్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతు కోసం విద్యుత్ సరఫరాను నిలిపుతున్నట్లు తెలిపారు.

వెంకటాపురం(ఎం): వెంకటాపురం, వెల్తుర్లపల్లి విద్యుత్ సబ్ స్టేషన్‌లలో మరమ్మతులు ఉన్న నేపథ్యంలో శనివారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ సురేష్ తెలిపారు. సబ్‌స్టేషన్‌ల పరిధిలోని ఆయా గ్రామాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు వెల్లడించారు.

బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యం

బీజేపీ దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు జనార్దన్



యాత్రలో పాల్గొన్న బీజేపీ నాయకులు

ఏటూరునాగారం: బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమని బీజేపీ దళిత మోర్చా జిల్లా అధ్యక్షుడు వావిలాల జనార్దన్ అన్నారు. మండల కేంద్రంలో బీజేపీ నాయకులు యువ మోర్చా సంకల్ప యాత్ర పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించి, మాట్లాడారు. మండల కేంద్రంలో యువ మోర్చా యాత్ర నిర్వహించామన్నారు. ఈ ఎన్నికలు దేశభవిష్యత్‌ను నిర్ణయించేవని, ప్రతి ఒక్కరూ భాగస్వాములై బీజేపీకి ఓటు వేయాలని కోరారు. అతి క్లిష్టమైన రామ మందిరం, ట్రిపుల్ తలాక్, కాశ్మీర్ లో 370యాక్ట్ రద్దు లాంటి ఎన్నో నిర్ణయాలు తీసుకున్నది కేంద్రంలోని మోదీ ప్రభుత్వమని కొనియాడారు. తెలంగాణకు ఎన్నో నిధులు మంజూరు చేశారని, ములుగు జిల్లాలో గిరిజన విశ్వవిద్యాలయం, రామప్పకు యునెస్కో గుర్తింపు, నాలుగు లైన్ల రహదారి తదితర అభివృద్ధి కార్యక్రమాలు బీజేపీ ప్రభుత్వంతోనే జరిగాయని తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గాడిచర్ల రాజశేఖర్, జిల్లా నాయకుడు వినుకోలు చక్రవర్తి, ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షుడు గడ్డం సత్యం, జిల్లా నాయకులు గద్దల హరిబాబు, రాకేష్, పురాణం ప్రకాష్, అభిషేక్, రాజు, సాయి పాల్గొన్నారు.

వామపక్షాల సదస్సును విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్‌రెడ్డి

ములుగు రూరల్: వామపక్షాల ఆధ్వర్యంలో ఈ నెల 16వ తేదీన నిర్వహించనున్న సదస్సును విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం జిల్లాకేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలన్నారు. దేశంలో ప్రధాని నరేంద్రమోదీ రైతుల సమస్యలపై ఇచ్చిన హామీలను అమలు చేయకుండా నిర్లక్ష్యపు ధోరణి అవలంభిస్తున్నారని ఆరోపించారు. మలి విడత రైతాంగ పోరాటాన్ని అణిచివేసేందుకు ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు. కార్మికులు పోరాటాలు చేసి సాధించుకున్న చట్టాలను రద్దు చేస్తూ నాలుగు కోడ్‌లను తీసుకొచ్చి కార్మికుల హక్కులకు భంగం కలిగించే విధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందని అన్నారు. పబ్లిక్ రంగ సంస్థలను అమ్ముతూ కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తున్నారని ఆరోపించారు. భారత రాజ్యాంగాన్ని విస్మరించే విధంగా మతోన్మాదాన్ని రెచ్చగొడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు రత్నం రాజేందర్, ఎండీ గఫూర్, కొత్ర రాజు, ముత్యాల రాజు, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.



ప్రమాదమని తెలిసినా..!

వాహనం ఏదైనా పరిమితికి మించి జనాలు ప్రయాణాలు చేస్తే ప్రమాదాలకు గురికాకతప్పదు. కానీ, ప్రమాదాలబారిన పడతామని తెలిసినా.. కొందరు ప్రయాణికులు తప్పనిసరి పరిస్థితుల్లో.. ప్రైవేట్ వాహనాలపైన సైతం కూర్చొని ప్రయాణాలు చేస్తున్నారు. ఇదే అదనుగా భావించిన ప్రైవేట్ వాహన యజమానులు వెంకటాపురం(కె) మండల కేంద్రం నుంచి వాజేడు, ఛత్తీస్‌గఢ్ ప్రాంతాలకు తమ వాహనాల్లో పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తున్నారు. సంబంధిత అధికారులు గమనించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

- వెంకటాపురం(కె)

ఉద్యమ నేతకు అవకాశం

బీఆర్ఎస్ వరంగల్ ఎంపీ అభ్యర్థిగా సుధీర్‌కుమార్

- మాదిగ సామాజికవర్గం వైపే కేసీఆర్ మొగ్గు
- హనుమకొండ జెడ్పీ చైర్మన్‌గా ఉన్న సుధీర్‌కుమార్
- బీఆర్ఎస్ ఆవిర్భావం నుంచి ఉద్యమాల్లో కీలకపాత్ర
- ఉమ్మడి కరీంనగర్, వరంగల్‌లో పలు పదవుల నిర్వహణ
- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ టి.రాజయ్యకు మరోమారు నిరాశ



సాక్షిప్రతినిధి, వరంగల్ :

వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థిని ఎట్టకేలకు ఆ పార్టీ అధినేత కేసీఆర్ ఖరారు చేశారు. రిజర్వ్ నియోజకవర్గం అయిన వరంగల్ లోక్‌సభ స్థానం నుంచి పార్టీ అభ్యర్థిగా డాక్టర్ మారెపల్లి సుధీర్‌కుమార్‌ను శుక్రవారం సాయంత్రం ప్రకటించారు. ఈ మేరకు ఉమ్మడి వరంగల్‌కు చెందిన ముఖ్యనేతలతో చర్చించిన మీదట సుధీర్‌కుమార్ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేశారు. హనుమకొండ జిల్లా వాసి, మాదిగ సామాజిక వర్గానికి చెందిన సుధీర్‌కుమార్ ప్రస్తుతం హనుమకొండ జెడ్పీ చైర్మన్‌గా కొనసాగుతున్నారు.

ముఖ్యనేతలతో భేటీ తర్వాతే ప్రకటన..
బీఆర్ఎస్(టీఆర్ఎస్) ఆవిర్భావం తర్వాత 2001 నుంచి మాజీ మంత్రి కెప్టెన్ లక్ష్మీకాంతారావు ఆధ్వర్యంలో సుధీర్‌కుమార్ తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించారు. తెలంగాణ ఉద్యమకారుడిగా, పార్టీకి విధేయుడుగా ఉంటూ అధినేత కేసీఆర్‌తో కలిసి పనిచేస్తున్నారు. వరంగల్ ఎంపీ అభ్యర్థి ఎంపికపై కసరత్తుకు సిద్ధమైన కేసీఆర్.. ఉమ్మడి జిల్లాకు చెందిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, పెద్ది సుదర్శన్‌రెడ్డి, ధర్మారెడ్డి తదితరులతో ఎర్రవెల్లి ఫాంహౌస్‌లో భేటీ అయ్యారు. అందరితో చర్చించి వారి సూచనలమేరకు అధినేత కేసీఆర్.. సుధీర్‌కుమార్ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

ఉమ్మడి కరీంనగర్, వరంగల్‌లో పలు పదవులు..
టీఆర్ఎస్(బీఆర్ఎస్) ఆవిర్భావానికి ముందు కాంగ్రెస్ పార్టీలో కొనసాగిన సుధీర్‌కుమార్.. మాజీ ఎంపీ, దివంగత సింగాపురం రాజేశ్వర్‌రావు, కెప్టెన్ లక్ష్మీకాంతారావు నాయకత్వంలో పనిచేశారు. ఉమ్మడి కరీంనగర్, వరంగల్ జిల్లాల్లో ఆయన అనేక పదవులు నిర్వహించారు. తొలుత 1995లో హనుమకొండ జిల్లా(పూర్వ కరీంనగర్ జిల్లా) ముల్కనూరు ఎంపీటీసీగా విజయం సాధించి భీమదేవరపల్లి మండల పరిషత్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. 2001 స్థానిక సంస్థల ఎన్నికల్లో భీమదేవరపల్లి జెడ్పీటీసీగా గెలుపొందారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్‌గా విజయం సాధించారు. 2018 ఎన్నికల్లో ఎల్కతుర్తి జెడ్పీటీసీగా గెలుపొందిన సుధీర్‌కుమార్ హనుమకొండ జిల్లా పరిషత్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. ప్రస్తుతం అదేపదవిలో కొనసాగుతున్నారు. బీఆర్ఎస్ పార్టీ, అనుబంధ సంఘాలకు సంబంధించిన పలు రాష్ట్రస్థాయి పదవులు సైతం నిర్వహించారు.

ఫాంహౌస్‌లో హైడ్రామా..
లోక్‌సభ ఎన్నికల సమయంలో వరంగల్ రాజకీయం రసవత్తరంగా మారింది. బీఆర్ఎస్ అభ్యర్థిగా ప్రకటించిన కడియం కావ్య.. పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరి ఆ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. దీంతో బీఆర్ఎస్ మరో అభ్యర్థిని ప్రకటించడం అనివార్యంగా మారింది. ఈ క్రమంలో బీఆర్ఎస్ వరంగల్ అభ్యర్థి ఎంపిక సందర్భంగా ఉమ్మడి జిల్లా ముఖ్యనేతలతోపాటు శుక్రవారం ఉదయం కేసీఆర్ నుంచి మాజీ మంత్రి తాటికొండ రాజయ్యకు కూడా పిలుపు వచ్చింది. అయితే అక్కడికి చేరిన రాజయ్య పరిస్థితులను గమనించి కాసేపటి తర్వాత వెళ్లిపోయారు. వరంగల్ జిల్లాకు చెందిన కీలక నేతలతో కేసీఆర్ సుదీర్ఘంగా చర్చించిన అనంతరం వరంగల్ పార్లమెంట్ అభ్యర్థిగా సుధీర్‌కుమార్ పేరు ఖరారు చేశారు. కాగా.. చివరి నిమిషం వరకు తాటికొండ రాజయ్య పేరు ప్రచారంలో ఉంది. టికెట్ తనకే వస్తుందని ఆశించిన రాజయ్య మరోసారి నిరాశకు గురయ్యారు.

సామాజికంగా ఎదుర్కోవడానికి..
ఇదిలా ఉండగా హనుమకొండ జిల్లాకు చెందిన సుధీర్‌కుమార్.. మాదిగ సామాజికవర్గానికి చెందిన నేత. అయితే కడియం శ్రీహరి, అరూరి రమేష్‌ను ఎదుర్కోవాలంటే క్షేత్రస్థాయిలో మంచి ఫాలోయింగ్, పలుకుబడి ఉన్న నేత అయితేనే కరెక్ట్ అని భావించిన కేసీఆర్.. సుధీర్‌కుమార్ పేరును ప్రకటించినట్లు తెలుస్తోంది. కాగా తనపై నమ్మకంతో వరంగల్ ఎంపీ అభ్యర్థిగా ప్రకటించిన పార్టీ అధినేత కేసీఆర్‌తోపాటు మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, కెప్టెన్ లక్ష్మీకాంతారావు, ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్యనేతలు, ఇతర పెద్దలకు పేరు పేరున డాక్టర్ సుధీర్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు, కార్యకర్తలు, ఉద్యమకారులు, అన్ని వర్గాల ప్రజలు నిండు మనసుతో ఆశీర్వదించి గెలిపించాలని ఆయన కోరారు.

ట్రాక్టర్ యజమానులు నిబంధనలు పాటించాలి

భూపాలపల్లి అర్బన్: రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లు నిబంధనలు పాటించాలని భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌రావు సూచించారు. శుక్రవారం పట్టణంలో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. పలు ట్రాక్టర్లకు రేడియం స్టిక్కర్లు అంటించారు. ట్రాక్టర్ యజమానులు డ్రైవర్లు రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలన్నారు. రాత్రి సమయంలో ట్రాక్టర్ ట్రాలీ కనపడే విధంగా రేడియం స్టిక్కర్లు అంటించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ నరేష్‌కుమార్, ఎస్సైలు పాల్గొన్నారు.

ఆశల విహారం!



నగర ప్రజలు మరికొద్ది రోజుల్లో గాల్లో విహరించనున్నారా? మామునూరులో ఎయిర్‌పోర్ట్ సిద్ధమవుతోందా? ఇందుకు ముందడుగు పడుతోందా? అంటే అవుననే చెప్పవచ్చు. మామునూరు ఎయిర్‌పోర్టులో వారం రోజుల నుంచి విమానాలు సందడి చేస్తున్నాయి. రన్‌వేపై దిగిన మూడు విమానాలతో ఆయా సంస్థల ప్రతినిధులు గురువారం జియోలాజికల్ సర్వే చేపట్టారు. దీంతో విమానాశ్రయం కల నెరవేరుతుందనే ఆశలు ఉమ్మడి జిల్లా ప్రజల్లో చిగురిస్తున్నాయి.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, వరంగల్

నెమళ్ల కళేబరాల పరిశీలన

సాక్షి స్పందన

బచ్చన్నపేట : మండలంలోని బండనాగారం గ్రామంలో తాగు నీరందక రెండు నెమళ్లు మృత్యువాత అనే సాక్షి కథనానికి జిల్లా అధికారులు స్పందించారు. జనగామ జిల్లా ఫారెస్ట్ రేంజ్ అధికారి కొండల్‌రెడ్డి ఆదేశంతో అధికారులు శుక్రవారం నెమళ్ల కళేబరాలత పాటు చుట్టుపక్కల పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఇటీవల రైతులు వరి పంటలను కోయడంతో సాగునీరు నిలిపివేశారు. ఈ ప్రాంతంలో చుట్టు పక్కల నీరు కూడా అందుబాటులో లేక పోవడంతో నీళ్ల అందక రెండు నెమళ్లు మృత్యవాత పడినట్లు తెలిపారు. వేటగాళ్లకు కూడా అవగాహన కల్పించామన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్ఓ రమేశ్, ఎఫ్‌బీఓ శాలిని పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో అనుమానితులు!

చిట్యాల : మండలంలోని వరికోల్‌పల్లి గ్రామ శివారు నందులబోడు గుట్ట వద్ద గుప్తనిధుల కోసం తవ్వకాలు చేపట్టిన అదే గ్రామానికి చెందిన కొంత మంది అనుమానితులను పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. నెల రోజుల క్రితం నందులబోడు గుట్ట సమీపంలో గుప్తనిధులు ఉన్నాయని పూజలు నిర్వహించి అక్కడి నుంచి విగ్రహాలను తీసుకు పోయినట్లు తెలుస్తోంది. దీంతో ఐదు రోజులగా విచారణ చేపట్టిన పోలీసులు అనుమానితులను తీసుకు వచ్చి విచారణ చేపట్టి ఆరా తీస్తున్నట్లు తెలిసింది. అనుమానితులకు గుప్తనిధుల తవ్వకాలలో దొరికిన విగ్రహాలు బంగారు విగ్రహాలా..లేదా పంచలోహ విగ్రహాలా? అనేది పోలీసుల విచారణలో తేటతెల్లం కానుంది. ఒకవేళ పంచలోహ విగ్రహాలయితే ఇంతకాలం ముఠా సభ్యులు ఎందుకు వారి వద్దే పెట్టుకుంటారని, అలాగే బంగారు విగ్రహాలు అయితే అవి ఎక్కడో విక్రయించి.. గుప్తనిధుల తవ్వకాలలో పంచలోహ విగ్రహాలే దొరికాయని చెబుతున్నారనేది గ్రామంలో చర్చ. ఏది ఏమైనా పోలీసుల విచారణలో అసలు నిజం తేలాల్సిందే. ఇదే విషయంపై ఎస్సై శ్రావణ్‌కుమార్‌ను వివరణ కోరగా అనుమానితులను విచారిస్తున్నట్లు తెలిపారు.

వాత్సల్యం 'మిస్సింగ్'

మంచి, చెడు చెప్పే రోజులు పోయి మార్కులు మాత్రమే అడిగే రోజులొచ్చాయి. కొసరి కొసరి వడ్డించేది లేక ఫాస్ట్ ఫుడ్‌లు పుట్టుకొచ్చాయి. నాన్నతో ఆటలు, అమ్మతో ముచ్చట్లు, నానమ్మ తాతయ్యలతో షికార్లు, అమ్మమ్మ ఇంట్లో సెలవులు గత కాలపు జ్ఞాపకాలుగానే మిగిలిపోతున్నాయి. టీవీలు, స్మార్ట్‌ఫోన్లు, సినిమాలు బాల్యాన్ని బందీ చేస్తున్నాయి. ఫలితంగా పిల్లలు ఇళ్లు దాటుతున్నారు. ఇంటి వద్ద పొందలేని వాత్సల్యాన్ని ఇంకెక్కడో వెతుక్కుంటున్నారు.



పిల్లలతో గడపలేకపోతున్న తల్లిదండ్రులు

- మంచి, చెడు గ్రహించలేని స్థితి
- గడప దాటి వెళ్లిపోతున్న వైనం
- ఉమ్మడి జిల్లాలో అధికమవుతున్న మిస్సింగ్ కేసులు

కాజీపేట : పిల్లలపై అభిమానం చూపించాల్సిన తల్లిదండ్రులు అధికారం చెలాయిస్తున్నట్లు తాజా సర్వేలు చెబుతున్నాయి. సాటి పిల్లలతో పోల్చుతూ మార్కులు తెచ్చుకోవాలని, ర్యాంకులు మోజులో ఒత్తిడికి గురి చేస్తున్నారు. దీంతో లేత వయస్సులో పొందాల్సిన ప్రేమాభిమానాలను పిల్లలు పొందలేకపోతున్నారు. ఇదే వారిని పక్కదారి వెతుక్కునేలా చేస్తోంది. తమకు తెలియకుండానే ఈ ఒత్తిడి ప్రపంచం నుంచి విడుదల పొందాలని గడప దాటుతున్నారు. ఫలితంగా పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసులు నమోదవుతున్నాయి. తల్లిదండ్రులు ఇద్దరూ ఉద్యోగులుగా ఉన్న కుటుంబాలతో పాటు కన్నవారి మధ్య అన్యోన్యత లేని జీవితాల్లో ఇలాంటివి అధికమవుతున్నాయి. ఏడుస్తున్న చంటి పాప నోట్లో పాలబుడ్డి పెట్టినంత సులువుగా అనేక మంది తల్లిదండ్రులు తమ పిల్లల నుంచి తప్పించుకునేందుకు స్మార్ట్‌ఫోన్లను ఎరగా వేస్తున్నారు. ఆ స్మార్ట్‌ఫోన్‌లే ఆ చిన్నారులను, యువతను పెడదోవ పట్టిస్తున్నాయని ఊహించలేకపోతున్నారు. రోజుకు గంట పాటు అయినా తమ పిల్లలతో గడపలేని పరిస్థితిలో భార్యాభర్తలు జీవితాన్ని నెట్టుకొస్తున్నారు. యాంత్రిక జీవితాన్ని గడుపుతూ కాలాన్ని మింగేస్తున్నారు.

కంత్రీగాళ్ల మాయలో..

ఉమ్మడి జిల్లాలోని మిస్సింగ్ కేసుల్లో 14 నుంచి 17 ఏళ్ల వయసు ఉన్న యువతులు, విద్యార్థినులు అధికం. ఇంటి వద్ద ప్రేమ పొందలేని వారు మంచి, చెడుల గురించి తెలుసుకోలేని వారు కంత్రీగాళ్ల మాయలో పడుతున్నారు. ఆ మాటా ఈ మాటా చెప్పి ఆడపిల్లలను ఆకర్షణకు గురి చేస్తున్నారు.వారి మాయలో పడిన విద్యార్థినులు ఇళ్లు వదిలి బయటపడి అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. మరోవైపు చదువు భారాన్ని మోయలేని చిన్నారులు తమ బాధను తల్లిదండ్రులు పట్టించుకోవడం లేదంటూ రోడ్డున పడుతున్నారు.

బయటకు వెళ్తే అంతే..

ఇళ్లు విడిచి బయటకు వెళ్లిన చిన్నారులు, యువతులు ఇంటికి వచ్చేందుకు నిరాకరిస్తున్నారు. తెలిసో.. తెలియకో బయటపడిన వారు హైదరాబాద్, మెదక్, నిజామాబాద్ తదితర ప్రాంతాలకు చేరుకొని కూలీగా, కార్మిక పనితో కాలం వెల్లదీస్తున్నారు. కేటుగాళ్ల చేతిలో మోసపోయిన యువతులు అర్ధాంతరంగానే తనువు చాలిస్తున్న ఘటనలు కూడా చోటు చేసుకుంటున్నాయి. ఉమ్మడి జిల్లాలో ప్రతిఏటా 180కి పైగా ఇలాంటి కేసులు ఆయా పోలీస్ స్టేషన్లలో నమోదవుతుండడం గమనార్హం. వీటిలో 20 శాతం కేసులు మాత్రమే సుఖవంతమవుతున్నాయి.

ఇలా చేస్తే మేలు..



తల్లిదండ్రులు రోజుకు గంటపాటు తమ పిల్లలతో సరదాగా గడపాలి. నెలకు ఒక్కసారి అయినా సినిమాకు తీసుకువెళ్లాలి. జాతరల సమయంలో తప్పనిసరిగా ఆయా ప్రదేశాలను చూపించాలి. లక్ష్యాన్ని నిర్దేశించే సమయంలో మహనీయుల జీవిత చరిత్రను వివరించాలి. భోజన సమయంలో ప్రేమానురాగాలు పంచాలి. సెలవులు, పండుగలు, శుభకార్యాల సమయంలో తమ బంధువులను పరిచయం చేయడంతో పాటు వారితో గడిపే విధంగా సహకరించాలి. ఎంత బిజీగా ఉన్నా సరే కుటుంబం, పిల్లలు అనే అంశాన్ని గుర్తుకు తెచ్చుకొని వ్యవహరించాలి. యుక్త వయసులో ఉన్న చిన్నారుల పట్ల చక్కటి ప్రేమను చూపించాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ వారి తప్పులను నేరుగా ఎత్తి చూపరాదు.

పిల్లలతో గడపడం ఉత్తమం



నేటియాంత్రిక జీవనానికి అలవాటు పడిన భార్యాభర్తలు పిల్లలతో గడిపేందుకు వెనకడుగు వేస్తున్నారు. అలా కాకుండా సమయం ఉన్నప్పుడల్లా ఉదయం, సాయంత్రం వేళల్లో పిల్లలతో సంతోషంగా ఉంటూ వారి ఆలోచనలను పంచుకోవాలి. తగు సలహాలు, సూచనలు ఇస్తూ భరోసానివ్వాలి. వారి ఇష్టాలను తెలుసుకుని పరిష్కరించాలి. ఎక్కువ సమయం పిల్లలతో గడిపేందుకు ప్రయత్నించాలి.

- బారుపాటి గోపి, మానసిక వైద్యనిపుణుడు

తల్లిదండ్రులదే బాధ్యత



చిన్నారులు, యువతుల మిస్సింగ్ కేసుల్లో కుటుంబ సభ్యుల పాత్ర ఉంటుంది. పట్టణాలకు కొత్తగా వచ్చిన వారు అపరిచితులతో ఎక్కువగా గడపకూడదు. కళాశాలలకు వెళ్తున్న తమ పిల్లల నడవడికపై తల్లిదండ్రులు దృష్టి సారించాలి. అధ్యాపకులు, ఉపాధ్యాయులు విద్యార్థులను తమ పిల్లలుగా భావించి హెచ్చరికలతో కూడిన తగు జాగ్రత్తలు చెప్పాలి. పోలీస్ శాఖ తరపున అన్ని కళాశాలల్లోనూ విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేసి అప్రమత్తం చేస్తున్నాం. మిస్సింగ్ కేసుల్లో ఎక్కువగా యువత ఉండడం చాలా బాధాకరం.

-వై.సుధాకర్ రెడ్డి, సీఐ, కాజీపేట

తప్పుడు ఫిర్యాదుకు జరిమానా..

మహబూబాబాద్ రూరల్ : కోర్టులో ఏదైనా కేసు విచారణ అయి అది నిరూపిస్తే దోషులకు శిక్ష పడడాన్ని సాధారణంగా చూస్తుంటాం. కానీ ఇందుకు భిన్నంగా ఓ కేసులో తప్పుడు ఫిర్యాదు చేసి కోర్టు విలువైన సమయాన్ని వృథా చేశారని ఒకరికి పది రోజుల్లో రూ.50 వేలు జరిమానా చెల్లించాలని లేదా మూడు నెలలు జైలు శిక్ష విధించాలని తీర్పు ఇచ్చారు. ఈ సంఘటన మహబూబాబాద్ జిల్లా కోర్టులో శుక్రవారం చోటుచేసుకుంది. తప్పుడు ఫిర్యాదు ఇచ్చిన సదరు వ్యక్తికి రూ.50 వేలు జరిమానా చెల్లించాలని లేనిపక్షంలో మూడు నెలలు జైలు శిక్ష అనుభవించాలని జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి పసుపులేటి చంద్రశేఖర ప్రసాద్ తీర్పు ఇచ్చారు. స్పెషల్ పోక్సో కోర్టు పీపీ కీసర పద్మాకర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లాలోని పెద్దవంగర పోలీసు స్టేషన్ పరిధిలో ఓ మైనర్‌పై అత్యాచారం జరిగిందని 2023 సెప్టెంబర్ 22వ తేదీన బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన అప్పటి ఎస్సై రాజు విచారణ చేపట్టి అనంతరం కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ పక్షాన స్పెషల్ పోక్సో కోర్టు పీపీ పద్మాకర్ రెడ్డి కోర్టులో వాదించగా సాక్షులను ప్రవేశ పెట్టే సందర్భంలో ఫిర్యాదుదారులు వాంగ్మూలం ఇచ్చేటప్పుడు తాను తప్పుడు కేసు పెట్టానని ఒప్పుకున్నారు. దీంతో ఆగ్రహించిన జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి చంద్రశేఖరప్రసాద్ పది రోజుల్లో రూ.50 వేలు జరిమానా చెల్లించాలని లేదా మూడు నెలలు జైలు శిక్ష విధించాలని తీర్పు ఇచ్చారు. విలువైన కోర్టు సమయాన్ని వృథా చేశారని జిల్లా జడ్జి ఆగ్రహం వ్యక్తం చేస్తూ అసత్య ప్రచారాలు, తప్పుడు ఫిర్యాదులతో కోర్టును తప్పుదోవ పట్టించాలని చూస్తే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. తప్పుడు కేసు పెట్టి పోలీసులను కూడా తప్పుదోవ పట్టించొద్దని చురకలంటించారు.

కొన్నెలో హైనాల సంచారం



బచ్చన్నపేట : మండలంలోని కొన్నె గ్రామంలో హైనాలు సంచరిస్తుండడంతో అన్నదాతలు భయపడుతున్నారు. హైనాలు ముఖ్యంగా లేగదూడలను చంపి ముఖ్యమైన అవయవాలను తిని, రక్తాన్ని తాగుతాయి. కొన్నె గ్రామంలో పెద్దగజగిరి గుట్ట ఉండడంతో పగలు ఆ గుట్టలో ఆవాసం ఉంటూ రాత్రవేళ హైనాలు విచ్చలవిడిగా సంచరిస్తున్నాయని పలువురు రైతులు వాపోతున్నారు. హైనాల దాడిలో లేగదూడలు చనిపోవడంతో ఆవులు, గేదెలు పాలు ఇవ్వక పోవడంతో పాడినే నమ్ముకొని జీవిస్తున్న రైతులు ఇబ్బందులు పడుతూ లక్షలు పెట్టి కొనుగోలు చేసిన పశువులను తక్కువ ధరకు విక్రయిస్తూ అప్పుల పాలవుతున్నారు. ఇప్పటికే చాలా మంది రైతుల లేగదూడలను హైనాలు చంపివేశాయని ఈలాంటి ఘటనలు జరగకుండా ఇప్పటికైనా ముందస్తు జాగ్రత్తగా సంబంధిత అధికారులు చొరవ తీసుకొని హైనాల బెడదను నివారించాలని పలువురు రైతులు కోరుతున్నారు.

రెడ్డి చికెన్ సెంటర్
Cell: 9989299661

కుంటలో దూకి యువకుడి ఆత్మహత్య



రాజు (ఫైల్)

ఖిలా వరంగల్ : తల్లిదండ్రులు మందలించడంతో క్షణికావేశం.. మనస్తాపానికి గురైన యువకుడు కుంటలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చేతికి అందిన కొడుకు దూరం కావడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఈ ఘటన శుక్రవారం వరంగల్ రంగశాయిపేట ప్రాంతం హంటర్‌రోడ్డు లోని గణపతి ఇంజనీరింగ్ కళాశాల సమీపన ఉన్న మద్దెలకుంట చెరువులో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. వరంగల్ రంగశాయిపేట ప్రాంతానికి చెందిన మచ్చ కుమారస్వామికి ఒక కుమార్తె, కుమారుడు మచ్చ రాజు(20) ఉన్నారు. ఇంటర్‌తోనే ఆపేసిన రాజు పైచదువులకు వెళ్లకుండా ఇంటివద్దనే ఉంటున్నాడు. చదువుకో లేదా.. ఏదైనా జాబ్ చేయి.. ఇంట్లో పెళ్లీడుకొచ్చిన అక్క ఉందంటూ చెబుతూ బుధవారం రాత్రి తల్లిదండ్రులు రాజును మందలించారు. దీంతో మనస్తాపం చెందిన రాజు గురువారం ఉదయాన్నే వాకింగ్ వెళ్తానని చెప్పి సాయంత్రమైన ఇంటికి రాలేదు. బయటికి వెళ్లిన కుమారుడు తిరిగి ఇంటికి రాలేదని తండ్రి కుమారస్వామి సాయంత్రం మిల్స్‌కాలనీ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.ఈ క్రమంలో శుక్రవారం ఉదయాన్నే వరంగల్ హంటర్ రోడ్డులోని రంగశాయిపేటలో గల గణపతి ఇంజనీరింగ్ కళాశాల సమీపాన మద్దెల కుంట చెరువుకు బహిర్భూమికి వెళ్లిన వ్యక్తులకు చెరువులో మృతదేహం కనిపించింది. వెంటనే మచ్చ కుమారస్వామి మద్దెల కుంట చెరువు వద్దకు చేరుకుని మృతదేహన్ని చూడగా అది తన కుమారుడిదేనని గుర్తించి మిల్స్‌కాలనీ పోలీసులు సమాచారం అందజేశాడు. సమాచారం అందుకున్న వెంటనే ఎస్సై గోవర్ధన్ హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకుని మృతికి గల కారణాలను సేకరించి మృతదేహన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఎంజీఎం మార్చురీకి తరలించారు. మృతుడి తండ్రి కుమారస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలు

రామన్నపేట : మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన ఇద్దరికి జైలు శిక్ష విధిస్తూ శుక్రవారం వరంగల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ గుర్రపు వీరస్వామి తీర్పు ఇచ్చినట్లు వరంగల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీధర్ తెలిపారు. హనుమకొండ వడ్డెపల్లికి చెందిన బానోత్ దేవేందర్, వరంగల్ శివనగర్‌కు చెందిన వెలికంటి వెంకటేష్‌కు జడ్జి వీరస్వామి మూడు రోజుల శిక్ష విధించినట్లు ఆయన పేర్కొన్నారు. తీర్పు అనంతరం నిందితులను పరకాల సబ్‌జైల్‌కు తరలించినట్లు వెల్లడించారు.

నకిలీ పోలీస్ అరెస్టు



అరెస్టు చూపుతున్న ఇన్‌స్పెక్టర్ సతీష్

వరంగల్ క్రైం : తనను నమ్మించి పెళ్లి చేసుకుంటానని మోసం చేశాడని హనుమకొండ జిల్లా శాయంపేట మండలం పత్తిపాక గ్రామానికి చెందిన మహిళ ఫిర్యాదు మేరకు నకిలీ పోలీస్‌ను అరెస్టు చేసినట్లు హనుమకొండ ఇన్‌స్పెక్టర్ సతీష్ తెలిపారు. సిరిసిల్ల రాజన్న జిల్లా వేములవాడ మండలం చేర్లవంచకు చెందిన మామిడి వెంకటేష్ అలియాస్ కిరణ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకొని అరెస్టు చేసినట్లు ఆయన తెలిపారు. నిందితుడు వెంకటేష్ సదరు మహిళ నుంచి బంగారు చైన్, ఉంగరం, రూ.లక్ష తీసుకొని ఇంకా డబ్బులు కావాలని బెదిరింపులకు పాల్పడినట్లు ఆయన వివరించారు. శుక్రవారం హనుమకొండ బస్టాండ్‌లో నిందితుడు సంచరిస్తున్నట్లు సమాచారం రావడంతో అరెస్టు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ సతీష్ పేర్కొన్నారు. నిందితుడి నుంచి 10 గ్రాముల గోపి తాడు, పోలీస్ శాఖకు చెందిన నకిలీ ఐడీ కార్డును స్వాధీనం చేసుకున్నామన్నారు.

ట్యాపింగ్‌లో పెద్ద తలలు వెలుగులోకి..!



కాంగ్రెస్ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతున్న రేవూరి ప్రకాశ్‌రెడ్డి

- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి
- మాదిగలకు ద్రోహం చేస్తున్నదే మంద కృష్ణ : కడియం

హన్మకొండ చౌరస్తా: ఒకటి, రెండు రోజుల్లో ఫోన్ ట్యాపింగ్‌లో పెద్ద తలకాయల పేర్లు బయటపడనున్నాయని పరకాల ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ వరంగల్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్యపై వరంగల్ బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్ చేసిన వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. కడియం కావ్యతో కలిసి హనుమకొండలోని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. కడియం కావ్య ఎస్సీ కాదని, అసలు వరంగల్ బిడ్డనే కాదని అరూరి రమేష్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సెంటిమెంటుతో అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ పార్టీ లక్షణాలు ఇంకా అరూరి రమేష్‌లో పోలేదని ఎద్దేవా చేశారు. ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని దుస్థితి తెచ్చిందే బీఆర్ఎస్.. ఆ పరిస్థితిని అంచెలంచెలుగా అధిగమిస్తూ 1 నుంచి 5వ తేదీలోగా ప్రభుత్వ ఉద్యోగులకు వేతనాలు అందిస్తున్నది రేవంత్‌రెడ్డి సర్కార్ అని పేర్కొన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ.. రాజ్యాంగాన్ని మార్చి రిజర్వేషన్లను ఎత్తివేస్తానన్న బీజేపీకి ఎందుకు మద్దతు ఇస్తున్నాడో చెప్పాలని మంద కృష్ణ మాదిగను ప్రశ్నించారు. మాదిగ ఉపకులానికి చెందిన తనపై వ్యక్తిగతంగా విమర్శలు చేయడం సరికాదన్నారు. ముస్లింలు, క్రైస్తవులు, దళితులను పట్టించుకోని బీజేపీకి మద్దతిస్తూ మాదిగలకు ద్రోహం చేస్తున్నదే మంద కృష్ణ వ్యాఖ్యానించారు. తన రాజకీయ స్వార్థం కోసం చేస్తున్న ద్రోహాన్ని మాదిగలు, దళితులు గమనించాలని కోరారు. వరంగల్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్య మాట్లాడుతూ.. బాల్యం నుంచి నేటి వరకు వరంగల్‌లోనే ఉన్నానని స్పష్టం చేశారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే, హనుమకొండ డీసీసీ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్, డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్ రావు, కత్తి వెంకటస్వామి, నమిండ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో ఢీకొని మహిళ మృతి



సాంబలక్ష్మి మృతదేహం

వరంగల్ క్రైం : సుబేదారి పోలీస్ స్టేషన్ పరిధిలోని హౌసింగ్ బోర్డు కాలనీలో గల కడాయి రెస్టారెంట్ దగ్గర శుక్రవారం మహిళను ఆటో ఢీకొనడంతో ఆమె మృతి చెందినట్లు సుబేదారి ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణరెడ్డి తెలిపారు. హనుమకొండ రాంనగర్‌కు చెందిన చాపర్తి సాంబలక్ష్మి (56) పలు ఇళ్లలో పనిచేస్తు జీవనం సాగిస్తుంది. శుక్రవారం ఇళ్లలో పని ముగించుకొని ఇంటికి వెళ్తున్న క్రమంలో రోడ్డు పక్కన కూరగాయలు కొంటున్న సమయంలో వేగంగా వచ్చిన ఆటో ఢీకొనడంతో కిందపడి తీవ్రగాయపడింది. స్థానికులు సాంబలక్ష్మిని ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆమె మృతి చెందిందని ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణరెడ్డి పేర్కొన్నారు. మృతురాలి కుమారుడు చాపర్తి రాజమౌళి ఫిర్యాదు మేరకు ఆటో డ్రైవర్ పోరిక రాజుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

అగ్ని ప్రమాదంతో భారీ నష్టం

- కాలిపోయిన మామిడి, జామ చెట్లు
- విద్యుత్ వైరు బండిల్స్, మోటార్లు దగ్ధం



కాలిబూడిదైన జామ చెట్లు

శాయంపేట : ప్రమాదవశాత్తు సంభవించిన భారీ అగ్ని ప్రమాదంలో మామిడి, జామ చెట్లతో పాటు విద్యుత్ వైరు బండిల్స్, మోటార్లు, పైపులు కాలిపోయాయని బాధిత రైతులు తెలిపారు. రేణిగుంట్ల ఐలయ్య కథనం ప్రకారం.. పరకాల–హనుమకొండ ప్రధాన రోడ్డులోని మాందారిపేట గుట్టల వద్ద ఏడేళ్ల క్రితం మామిడి, జామ తోటలు సాగు చేసినట్లు తెలిపారు. మామిడి కాయలు చేతికి అంది వస్తుందనుకున్న తరుణంలో శుక్రవారం మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తులు సమీప పంట చేలల్లో నిప్పు వేయడంతో మంట రాజుకుంది. దీంతో 20 మామిడి చెట్లు, 30 జామ చెట్లు, నాలుగు వైర్ బండిల్స్, ప్లాస్టిక్ పైపులు అగ్నికి ఆహుతి అయినట్లు తెలిపారు. ఇదే విషయమై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఐలయ్య తెలిపారు. కాగా ఇవే మంటలు రాజుకుంటూ వెళ్లడంతో రేణిగుంట్ల భరత్‌కు చెందిన 30 జామ చెట్లు, కొమ్ముల రామస్వామికి చెందిన విద్యుత్ మోటార్, విద్యుత్ వైరు, స్టార్టర్ బాక్స్, 30పైపులు, రేణిగుంట్ల మొగిలికి చెందిన రెండు మోటార్లు, 15 పైపులు, విద్యుత్ వైరు, స్టార్టర్ బాక్స్, కొమ్ముల పరమేశ్వర్‌కు చెందిన ఆరు పైపులు, వైర్ కాలిపోయినట్లు బాధితులు తెలిపారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని అగ్ని ప్రమాదంపై దర్యాప్తు చేపట్టారు.

ఇసుక క్వారీలో ఉపాధి కల్పించండి

- పనులను అడ్డుకున్న పెద్దంపేట గ్రామస్తులు



ఇసుక క్వారీ పనులను అడ్డుకుంటున్న గ్రామస్తులు

మహదేవపూర్ : ఇసుక క్వారీలో తమకు ఉపాధి కల్పించాలని మండలంలోని పెద్దంపేట గ్రామస్తులు శుక్రవారం ఇసుక తవ్వకాల పనులు అడ్డుకున్నారు. అనంతరం గ్రామస్తులు మాట్లాడుతూ.. ఇటీవల గోదావరిలో ఇసుక తీసేందుకు ప్రభుత్వం టెండర్లు నిర్వహించిందన్నారు. అందులో భాగంగానే పెద్దంపేట క్వారీ వద్ద లక్ష యాభై వేల మెట్రిక్ టన్నుల ఇసుక తవ్వేందుకు గుత్తేదారుకు పనులు అప్పగించిందని పేర్కొన్నారు. కాగా గోదావరి నుంచి ఇసుకను బయటకు(ఒడ్డు) తెచ్చేందుకు మాన్యువల్(మనుషుల) ద్వారా మాత్రమే పనులు చేయించాలనే ఆదేశాలు ఉన్నాయని చెప్పారు.అయినా అవేమి పట్టించుకోకుండా కాంట్రాక్టర్ రాత్రి వేళ పంకెన గ్రామం నుంచి మట్టి తరలించి గోదావరిలో రోడ్డు వేసి రాత్రికి రాత్రే పొక్లెయినర్‌తో టిప్పర్లలో ఇసుక నింపి గోదావరి ఒడ్డుపై డంప్ చేస్తున్నారు.కాగా ఇసుక క్వారీ యజమాన్యం గ్రామస్తులతో మాట్లాడుతూ.. టన్ను ఇసుక తీసేందుకు రూ.50 ఉంటుందని ఎండలో మీరు ఆ పనులు చేయలేరని దబాయించే ప్రయత్నం చేశారు. అనంతరం గ్రామస్తులు మాట్లాడుతూ.. తమ గ్రామంలో 600 మంది జనాభా ఉన్నారని కాంగ్రెస్ ప్రభుత్వం తమకు ఉపాధి కల్పించేందుకు ఇసుక క్వారీ మంజూరు చేసిందన్నారు. కాంట్రాక్టర్ మాత్రం ఉపాధి కల్పించక, కుంటి సాకులు చెబుతున్నాడని వారు ఆరోపించారు. ఇదే అంశంపై జిల్లా కలెక్టర్ స్పందించి తమకు ఉపాధి కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

దాడికి పాల్పడిన వారిపై చర్యలు

- ఏసీపీ హామీతో.. విధుల్లోకి కార్మికులు



విధుల్లో చేరిన పారిశుద్ధ్య కార్మికులు

పరకాల : పారిశుద్ధ్య కార్మికురాలిపై దాడికి పాల్పడిన మహిళపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని పరకాల ఏసీపీ కిషోర్‌కుమార్ స్పష్టం చేశారు. దీంతో పరకాల మున్సిపల్ కార్మికులు శుక్రవారం సాయంత్రం నుంచి విధులకు హాజరయ్యారు. పారిశుద్ధ్య కార్మికురాలు చుక్క కమలపై దాడి చేసిన మహిళను అరెస్టు చేయాలని పరకాల మున్సిపల్ కార్మికులు రెండో రోజు విధులకు దూరంగా ఉన్నారు. దీంతో పట్టణంలోని ప్రధాన రహదారులు చెత్త చెదారంతో నిండిపోయాయి. కార్మికుల ఆందోళనకు ఐఎన్‌టీయూసీ, సీఐటీయూ అనుబంధ మున్సిపల్ కార్మిక సంఘాల నాయకులతో పాటు ఎమ్మార్పీఎస్ నాయకులు సంపూర్ణ మద్దతు తెలిపారు. దాడిచేసిన మహిళను తక్షణం అరెస్టు చేసే వరకు ఆందోళన విరమించే ప్రసక్తే లేదని మున్సిపల్ కార్మికులు స్పష్టం చేశారు. పరకాల ఏసీపీ కిషోర్‌కుమార్ దాడికి పాల్పడ్డ నిందితురాలిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయడం జరిగిందని, విచారణ చేపట్టి అరెస్టు చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో పారిశుద్ధ్య కార్మికుల విధులకు హాజరయ్యారు. అరెస్టు విషయంలో జాప్యం చేస్తే మళ్లీ విధులకు హాజరు కాబోమని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పూరేళ్ల రమేష్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఉప్పలయ్య స్పష్టం చేశారు.

పారిశుద్ధ్య కార్మికురాలిపై దాడి చేసిన మహిళ అరెస్టు

పారిశుద్ధ్య కార్మికురాలిపై దాడి చేసిన పల్లెబోయిన శశిని అరెస్టు చేసి పరకాల మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చినట్లు సీఐ డి.రవిరాజ్ తెలిపారు. తాగేందుకు నీరు అడిగినందుకు పారిశుద్ధ్య కార్మికురాలు చుక్క కమలను కులం పేరుతో దూషిస్తూ దాడి చేసి గాయపర్చిన శశిపై బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. శుక్రవారం అదుపులోకి తీసుకున్న పోలీసులు ఆమెను అరెస్టు చేసి పరకాల కోర్టులో హాజరుపర్చగా మేజిస్ట్రేట్ 15 రోజుల రిమాండ్ విధించింది. దీంతో ఆమెను పరకాల సబ్‌జైల్‌కు తరలించారు.

నిందితురాలి ఆత్మహత్యాయత్నం!

పారిశుద్ధ్య కార్మికురాలిపై దాడి కేసులో అరెస్టు భయంతో నిందితురాలు పల్లెబోయిన శశి ఓ పెట్రోల్ బంక్ సమీపంలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు సమాచారం. ఒంటిపై పెట్రోల్ పోసుకోవడంతో అక్కడే ఉన్న కొందరు వ్యక్తులు ఆమెను కాపాడి.. పరకాలలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయిన కొద్దిసేపటికే కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సిలింగ్ ఇచ్చి పోలీసులు ఆమెను అరెస్టు చేశారు.

బస్సు ఢీ.. తీవ్ర గాయాలు

- తెగిపడిన మహిళ కాళ్లు



వరంగల్ క్రైం : హనుమకొండ ఆర్టీసీ బస్టాండ్‌లో శుక్రవారం ఓ మహిళను బస్సు ఢీకొనడంతో ఆమె రెండు కాళ్లు అక్కడికక్కడే తెగిపడ్డాయి. హనుమకొండ ఇన్‌స్పెక్టర్ కథనం ప్రకారం.. శాయంపేట మండల కేంద్రానికి చెందిన కావటి రాజక్క పత్తిపాక నుంచి హనుమకొండకు వచ్చి చేపలు అమ్ముకొని తిరిగి గ్రామానికి వెళ్లేందుకు బస్టాండ్‌కు వచ్చింది. కాగా, బస్ డ్రైవర్ అజాగ్రత్తగా, వేగంగా వచ్చి రాజక్కను ఢీకొట్టడంతో ఆమె రెండు కాళ్లు నుజ్జునుజ్జయి తెగిపడ్డాయి. తీవ్ర రక్తస్రావం కావడంతో స్థానికులు బాధితురాలిని వెంటనే ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. బాధితురాలి అల్లుడు బోయిని వినోద్‌కుమార్ ఫిర్యాదు మేరకు ఆర్టీసీ బస్సు డ్రైవర్ మహేందర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

PLOT FOR SALE

■ మామునూర్‌లో కుడా లేఅవుట్ రెండు దిశలా చౌరస్తా నుండి మరియు జ్యోతిబాపులే ఆశ్రమ పాఠశాల పక్క నుండి 800 మీటర్ల దూరంలో పెన్షన్‌పూరా డాంబర్ రోడ్డుపై సౌత్ ఫేసింగ్ 263, 228 అమ్మకానికి 9032111600. [W-1264875]

SERVICES

■ వరంగల్ నగరమందు పర్మిషన్‌తో కూడిన ప్లాట్లు & ఇండ్లు దొరుకును. నిరుద్యోగులకు గొప్ప అవకాశం కెనడా, ఆస్ట్రేలియా, వర్క్ వీసా Helping Hand Seva Society ద్వారా ఉద్యోగం చేస్తూ EMI పద్ధతిలో చెల్లించవచ్చు. ఫోన్: 9014743326. [W-1264930]

CHANGE OF NAME

■ I, the undersigned MOHD ZAHEERODDIN, S/o. Mohd Gouse Moinoddin (New Name), previously called Mohd. Zaheeruddin, S/o. Mohd. Gouse Moinoddin (Old Name) and residing at H.No. 11-23-1728, Teachers Colony, LB Nagar, Warangal Dist, Telangana State, India and solemnly declare. [W-1264931]

అద్భుత అవకాశం

■ రోజుకి 5000 నుండి 50 వేల వరకు సంపాదించుకొనే అవకాశం. విద్యార్థులు, గృహిణులు, రిటైర్డ్ ఎంప్లాయిస్ ఎల్.ఐ.సి ఏజెంట్స్, మార్కెటింగ్ పర్సన్స్ మొ॥ 9848214521. [WA-1264878]

BUSINESS OFFER

■ కంపెనీ అన్ని రకాల బిజినెస్ ల్యాప్ ప్రాజెక్ట్‌ను అందిస్తుంది. వ్యక్తిగత, విద్య, టేక్ ఓవర్ అగ్రికల్చర్ ఏజెంట్ కావలెను. DMA Welcome, Salary + కమీషన్ ఆఫీసు, ఖర్చులు. ✆ 89208 66865. [T-1252729]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/- రూ॥ అదనపు లైను 60/- రూ॥ మాత్రమే 5% GST అదనము

WANTED

■ ఆర్గానిక్ స్టోర్‌లో పని చేయుటకు ఆడవారు కావలెను. చదువు అవసరం లేదు. వయస్సు 35 సం॥ నుండి 50 సం॥ వరకు. సంప్ర॥ మామునూర్ క్యాంపు. సెల్: 9959975382. [W-1264929]

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్స్ కలవు. మీ పేరు, అడ్రస్ కాల్ / వాట్సప్ చేయగలరు. 90596 63584, 95026 15217. [M-1185032]

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఉచిత వసతి + భోజనం జీ: 18K. Ph: 9640258899, 9640468899 [H-799863]

■ Hydలోని పేషెంట్లను, ముసలివారిని, వారి ఇంటి వద్దనే చూసుకొనుటకు ఆయాలు, వార్డ్ బాయ్స్, నర్సులు, కేర్‌టేకర్స్ కా॥. జీ : 10-25 వేలు. రూం + భో॥ ఫ్రీ. Ph: 9000638842, 9866605144 [HA-13644]

ఈ పెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ	9010144453
వరంగల్	9705748198
నర్సంపేట	9553955722
జనగామ	9951602871
మహబూబాబాద్	9010144453
పరకాల	9010299096
జయశంకర్ భూపాలపల్లి	9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రత్యుత్తరమివ్వాల్సిందిగా మా పాఠకులను కోరుతున్నాము. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.